

# దయ్యపు పుంజు

శ్రీ వాసిపల్లె
వెంకటేశ్వరరెడ్డి

తెల్లవారితే భోగిపండుగ. వేణూని వాళ్ల అమ్మ తెల్లవారుఝామునే నిద్ర లేపేసింది. వేణూ గబగబ లేచి తానిమధ్య శ్రమపడి పోగుచేసిన కంప తుట్టెలను తగుల వేయడం మొదలు పెట్టేడు. చెల్లాయి యింటిలోని పాత చీపురులను, చేటలను తెచ్చి మంటలో వేయడం మొదలు పెట్టింది.

భోగిమంట లయ్యాక తలంటు పోసికొని, అమ్మచేసిన వేడి వేడి దోసెలు, బంగాళాదుంపలు కూర వేయించుకొని తిన్నాడు. జొన్న చేలవైపు అలా షికారుగా వెళ్లి వస్తే బావుంటుదని వాసు యింటికి బయలుదేరి వెళ్లాడు.

'చేని దగ్గరున్న వాళ్ల తాతయ్యకు దోసెలు, ఫలహారం తీసుకొని వెళ్లాడు నాయనా' అని సీనూ వాళ్లమ్మ చెప్పింది. వాణ్ణి అక్కడ చేలోనే కలుసుకొని కాసేపు హాయిగా అటు తిరిగి రావచ్చనుకొని గబగబా పొలాల వేపు నడవడం మొదలెట్టేడు.

బాట కిరువైపులా జొన్నపైరు కన్నుల పండువుగా కలకల లాడు తోంది. అక్కడక్కడ బంగారు చారలతో దోనపండ్లు నేలపై దొర్లాడు తున్నాయి. పెసర చెట్లు గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. ఇవన్నీ చూస్తూ నడుస్తోంటే వేణూ హృదయంలో అంతులేని ఆనందం కలిగింది. భూమాత తన బిడ్డలకోసం ఎన్ని రకాల వంటలు వండిపెట్టుతున్నదో కదా అని అబ్బురపడ్డాడు.

రొజుకుంటూ, పరుగెత్తుతూ ఎదురొచ్చాడు వాసు. "ఏమి ట్రోయ్ పరుగెత్తుతున్నావు? నీకో సరమే నేనూ వస్తున్నా!" అన్నాడు వేణు.

"మళ్ళీ మాట్లాడుకుందాం గానీ, ముందు పరుగెత్తరా! దయ్యం తరుముకు వస్తోంది!!" అని వేణు చేతిని పట్టుకు తనతో లాక్కు పోయాడు. వేణు కూడా తన ప్రయత్నం లేకుండానే పరుగు ప్రారంభించేశాడు.

"దయ్యమా? ఏదీ-ఎక్కడుందీ? అన్నాడు పరుగెత్తుతున్న వేణు.

"ఆ ప్రక్క చేలోనే ఉందిరా! నేను నడిచి వస్తోంటే "బాబూ-బాబయ్యా!" "బాబూ-బాబయ్యా!" అంటూ ఏవో అరుపులు వినపడ్డాయిరా! ఏమిటో నని నేను అటువైపు తిరిగి చూతును



గదా- ఓ పెద్ద కోడిపుంజు "బాబూ, బాబయ్యా" అంటూ నావేపు పరుగెత్తుకొస్తోంది...అబ్బ! గుండె లదిరిపోయినాయిరా! అమాంతం అక్కడ నుండి యిక్కడికి దూకినట్లుగా పరుగెత్తుకొచ్చే నంటే నమ్ము!" అన్నాడు వాసు-వెనుక నుండి దయ్యప్పుంజు వస్తోందేమోనని మాటి మాటికి వెనక్కి తిరిగి చూస్తూనే.

ఇదంతా వినేసరికి వేణుకి కూడా భయమేసింది. ఇక ఎలాగూ వాసు పొలాల మీద షికారుకి రాడు. తానొక్కడు మాత్రం యిక ఎలా పోగలుగుతాడు-ఒకవైపు దయ్యాన్ని గురించి వింటూ? ఇద్దరూ కలిసి వేణు ఇల్లు చేరుకొన్నారు.

పండక్కి అత్తారింటికి వచ్చిన వేణువాళ్ల బావ పోకుగా ముస్తాబై బయట వరండాలోని ఈజీ చెయిరులో కూర్చుని సిగరెట్టు దమ్ము లాగుతున్నాడు. వేణుని చూడ్డంతోటే "ఎక్కడి కెళ్లావురా?" అన్నాడు.

"పొలాలు చూడ్డానికి వెళ్లాం!!"

"మరి-అప్పుడే వచ్చేశారేం?"

"మధ్యలో దయ్యముంది బావా!"

"ఛా! దయ్యమేమిట్రా నీ ముఖం!" అన్నాడు బావ నవ్వుతూ.

"కాదు బావా! నిజంగానే! వాసు చూశాడు! ఏంరా వాసూ?"

వాసు అవునన్నట్లు తల వూపేడు.

"అయితే మరి దయ్యమెలా వుందో చెప్పరా!" వాసూని ప్రశ్నించేడు.

"మరేమో...అచ్చంగా కోడి పుంజులాగే ఉందండీ!" అన్నాడు వాసూ...అంతకంటే మంచి మాటలు దొరకక.

"అయితే కోడిపుంజే నేమో!"

"కాదండీ! కోడిపుంజే అయితే ఎలా మాట్లాడుతుందండీ! 'బాబూ బాబయ్యా!' అని అరుస్తోంటేనే"

"అరే; తమాషాగా ఉన్నాయే నీమాటలు! కోడి ఎలా మాట్లాడుతుందిరా?" అన్నాడు వేణు బావ.

"అది దయ్యమే బావా! కోడి కాదు!" అన్నాడు వేణూ.

"దయ్యం లేదు, గియ్యం లేదు, పట్టిది పోండ్రా!" అన్నాడు బావ.

ప్రక్కనుండి ఇదంతా వింటూన్న పాలేరు సుబ్బన్న అక్కడికి వచ్చి-"అబ్బాయిగార్లు చెప్పిన మాటలు నిజమే బాబూ! నిన్న సాయంత్రము గూడా చాలా మందికి యిట్లానే ఆపుంజు కనుపించిందంట! గడ్డికి పోయిన ఆడోళ్లంతా భయపడి లగెత్తుకొచ్చారు" అన్నాడు.

"అలాగా!" వేణూ వాళ్ల బావకు ఆశ్చర్యం వేసింది. కాని తాను ఏదీ స్వయంగా చూడందే నమ్మడు. "సరే పోయి అదేమిటో తేల్చుకొద్దాం" అని వేణూ వాళ్ల బావ సుబ్బన్నను, వేణూ, వాసూలను వెంటబెట్టుకొని బయలుదేరాడు. ఎందుకైనా మంచిదని సుబ్బన్న ఒక పెద్ద కుందేటి వల సంపాదించి చేత పట్టుకొచ్చేడు.

వాసూ చూపించిన చేలో అందరూ ఆగేరు. శబ్దం ఎటువేపు నుంచైనా వస్తుందేమోనని అందరూ నిశ్శబ్దంగా నిలుచుండి నలువైపులా చూస్తున్నారు.

"అదుగదుగో వస్తోంది!" అన్నాడు సుబ్బన్న-సన్నని గొంతుకతో. వేణూ, వాసూలు ఎగిరి ఒక గంతులో పోయి సుబ్బన్న వెనుక దాగేరు.

వేణూ వాళ్ల బావ గూడ ఆశ్చర్యంతో అటువేపు చూసేడు. ఆకారం అచ్చం మన మామూలు కోడిపుంజు లాగే ఉంది. సైజు మాత్రం కొంచెం పెద్ద. సుబ్బన్న జొన్న చేలో పొంచిఉండి దగ్గరకు రాగానే వల విసరేడు. పుంజు వలలో చుట్టుకు పోయింది!

"బాబూ!- బాబయ్యా!" అని అరవడం మొదలెట్టింది, వలలో పడ్డ పుంజు! వేణూ బావ, సుబ్బన్న, యిద్దరు పిల్లలు దాని దగ్గరకు చేరారు. సుబ్బన్న దాన్ని రెండు చేతులతోనూ పట్టుకొని "దయ్యం గాదు, గియ్యం కాదు - దీని కూతే యింత బాబూ!" అన్నాడు నవ్వుతూ!

"అయితే మాత్రం - చాలా విచిత్రంగా ఉంది సుబ్బన్నా! చూడు అచ్చం మనిషి లాగానే అరుస్తోంది!" అన్నాడు వేణు వాళ్ల బావ. వాసూ, వేణూల భయం ఎగిరిపోయింది. సంతోషంతో గంతు లెయ్యడం మొదలెట్టేరు. సుబ్బన్న వలతోపాటే పుంజుని చంకన బెట్టుకొని బయలుదేరాడు; వాడివెనకాలే వేణూ, వాళ్ల బావ, వాసూ కూడా నడిచారు.

ఇల్లు చేరుకునే సరికల్లా ఊరిలోని జనమంతా విరగబడ్డారు దాన్ని చూడటానికి! అది మాటి

# ★ దయ్యపు పుంజు ★

మాటికి - "బాబు, బాబయ్యా" అంటూనే వుంది.

"దీన్ని వదిలేయండి; లేకుంటే వూరికి చెరుపు కలుగుతుంది!" అన్నాడు రామశాస్త్రి. "నిజమే! అలాగే చేయండ"న్నారు గ్రామస్తులంతా.

కాని అలా దాన్ని వూరికనే వదిలేసే ఘటం కాదు వేణూబావ! ఒక కొయ్యపెట్టె చేయించి ఆపుంజును అందులో పెట్టి, అత్తయ్యా వాళ్లు వద్దంటున్నా వినకుండా, తనవెంట తీసి కెళ్ళాడు.

బస్సు కదిలేటప్పుడు వేణూ అడిగేడు-"దాన్ని ఎక్కడికి బావా తీసుకెళ్తున్నావు?" అని

"మదరాసుకోయ్ అన్నాడు!"

బస్సు కదలిపోయింది మదరాసు కెందుకో వేణూకు అర్థం కాలేదు; ఇంటికి వచ్చేడు దారి పొడుగునా ఆలోచిస్తూ.

ఐదవనాటి కల్లా వేణూ నాన్న పేరట ఒక పెద్ద రిజిష్టర్డు పార్సల్ వచ్చింది, పోస్టులో. వేణూ నాన్న దాన్ని యింటికి తెచ్చేడు. విప్పడం మొదలుపెట్టేసరికి యింట్లో అందరూ చుట్టూ మూగేరు.

దాంట్లో రెండు జతల బూట్లు, ఒక ఉన్నిశాలువ ఉన్నాయి. మధ్యనున్న చీటీ తీసి వేణూ నాన్న యిలా చదవడం మొదలెట్టేడు.

"...అ పుంజును నేను మదరాసులో జంతు ప్రదర్శనశాల వాళ్లకి అమ్మేను. రెండు వందల రూపాయలు వచ్చాయి. ఆడబ్బుతో వేణూ, వాసూలకు చెరి యొకజత బూట్లు, సుబ్బన్నకో శాలువ కొని మిగతా పైకంతో నేనొక రిష్టువాచీ కొనుక్కొన్నాను..."

"అల్లుడు చాల గట్టివాడండోయ్!" అంది వేణూ వాళ్లఅమ్మ.

రెండు బూట్లజతలు చేత పుచ్చుకొని వాసూ యింటికి పరుగెత్తేడు వేణు! ★

# చైనాలో గాలిపడగ దినం

(37-వ పేజీ తరువాయి)

నొకదాన్ని కట్టాడు. దానికి దారం కట్టిపైకి వదిలేసరికి అది ఆకాశంలో చిత్ర విచిత్రంగా నాట్యం చేయడం మొదలెట్టింది.

అలా గాలిపటం ఆకాశంలో నాట్యం చేస్తుంటే చూచేవారందరికీ తాము కూడా అలా ఎగురవేయాలని బుద్ధి పుట్టింది. వెంటనే వారంతా 'నింగ్‌చ్యూ' చేసినట్లు గాలిపటాలను తయారుచేసి ఆకాశంలో ఎగురవేశారు. గాలి తాకిడికి అవి బహు చిత్రంగా నాట్యం చేస్తుంటే చూచినవారి హృదయాలు సంతోషంతో పొంగిపొర్లాయి.

చెడిపోయిన గాలి పటాలను బాగుచేయడం, గాలిలో ఎగురవేస్తూ సంతోషంతో ఎవరి పటం ఎక్కువ ఎత్తు పోతుందోనని పందాలు వేసుకోవడంతో ఇంటికి పోవాలన్న తొందర వారికి కలుగనే లేదు.

ఈలోగా లోయలో వ్యాధి వచ్చి వున్నవాళ్ళందరిని దాదాపుగా వూడ్చుకుపోయింది-ఇదంతా జరిగిన తర్వాత 'నింగ్‌చ్యూ' ఇక ఫర్వాలేదులే అనుకొని, వారందరిని తిరిగి సుఖంగా యింటికి పోవచ్చని ఆదేశించాడు. ఇన్నాళ్ళు తామెలా గడిపామా అని ప్రజలంతా ఆశ్చర్య పోయారు. వ్యాధినుండి రక్షించినందుకు కృతజ్ఞతతో వారి హృదయాలు నిండి పోయాయి. నింగ్‌చ్యూను అనేక విధాలుగా కీర్తించారు. లోయఅంతటా సంతోషం వెల్లి విరిసింది.

ఆలోయలోని వారంతా తమ కృతజ్ఞతా చిహ్నంగా ప్రతి సంవత్సరము నింగ్‌చ్యూ జన్మ దినోత్సవము జరుపుతూ వుంటారు. ఆరోజునే ఆబాల గోపాలము గాలి పడగల నెగురవేసి ఆనందంగా కాలం గడుపుతారు. కొన్ని సంవత్సరాలు గడచిన తరువాత ఆపండుగ దేశమంతా వ్యాపించింది.

చైనానుండే ప్రపంచ దేశాలన్నీ గాలి పటాలను చేయడం తెలుసుకొన్నాయి. మనం కూడా గాలిపటాల నెగురవేస్తున్నప్పుడు మానవజాతి మేలును కోరిన ఆ 'నింగ్‌చ్యూను' ఒక్కసారి మనస్సులో జ్ఞాపకం చేసుకొందాం. ★

రాజూ - పేదా
వెల రూ 2-0-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-7.